భయమేస్తోంది..



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో భయమేస్తోంది. వెలుగులోకి వస్తున్న నిజాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడు ఇప్పుడే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి పీజీ చదువుకుంటున్నారు. ఇలాంటి ఘటనలతో మళ్లీ ఇళ్లకే పరిమితమై పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వాలు నిందితుడుతో పాటు కారణమైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలి. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులలో ధైర్యం నింపాలి.

-లిఖిత, వైద్య విద్యార్థిని



కఠిన చట్టాలు తేవాలి

తల్లిదండ్రులకు దూరంగా ఉండి కష్టపడి వైద్య విద్య చదువుకుంటున్నాం. ఇలాంటి ఘటనలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజానికి వైద్య సేవలందించాలని ఆశయంతో చేరాం. దేశానికి మా వంతు సేవలందించాలని ఆకాంక్ష. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– దేవిరెడ్డి మాధురి, వైద్య విద్యార్థిని



క్లుప్తంగా

31న నగరపాలక సంస్థ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈనెల 31వ తేదీ నిర్వహించనున్నట్లు కౌన్సిల్ సెక్రెటరీ చెరువు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీన జరిగిన సమావేశంలోని అంశాలను ధ్రువపరిచేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



తాళ్లాయపాలెం(తాడికొండ): తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. తొలుత సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఇసుక కోసం వచ్చిన వాహనాలను పరిశీలించిన ఆమె రోడ్డుపై అనవసరంగా వాహనాలు నిలపకుండా నియంత్రణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌ను సందర్శించి ఇసుక రవాణా కోసం యార్డుకు వచ్చిన వాహనదారులతో కలెక్టర్ మాట్లాడారు. తుళ్లూరు, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం, గుంటూరు ఆర్డీఓ కార్యాలయాల్లో ఇసుక బుకింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. బుకింగ్ చేసుకున్న వాహనాలకు కేటాయించిన స్లాట్ ప్రకారం స్టాక్ యార్డుల వద్ద అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఇసుకను బుకింగ్ చేసుకునే సందర్భంలో అవసరమైన ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన లైసెన్స్ అందించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని ఆ మేరకు స్లాట్ టైమింగ్ ప్రకారం స్టాక్ యార్డుకు వాహనాన్ని తీసుకెళ్లి ఇసుకను ట్రాన్స్‌పోర్ట్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, ఇన్‌చార్జి ఆర్డీఓ గంగరాజు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథరావు, మైన్స్ డీడీ చంద్రశేఖర్, తుళ్లూరు తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

సీఆర్ నగర్‌కు ప్రధాన రోడ్డు నిర్మించాలి



లక్ష్మీపురం: చంద్ర రాజేశ్వరరావు నగర్ ప్రధాన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కె.మాల్యాద్రి కోరారు. స్థానిక సీఆర్ నగర్‌లో సమస్యలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎంపీ గల్లా జయదేవ్ శంకుస్థాపన చేసినా ఇంత వరకు నగరపాలక సంస్థ అధికారులు రోడ్డు సంబంధించిన ప్రతిపాదనలు జిల్లా ఉన్నతాధికారులకు పంపించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ పోరాట ఫలితంగా విద్యుత్, రోడ్లు, కాలువలు తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు నగర కమిటీ సభ్యులు దేవానాయక్ మరియు హుస్సేన్ బి, మౌలాలి, బత్తుల శ్రీను, ఖాసీం, మస్తాన్ పాల్గొన్నారు.

పీఎన్ఎస్ చంద్రబోస్ సేవలు మరువలేనివి

నెహ్రూ నగర్: సామాజిక బాధ్యతతో సమాజానికి రెవరెండ్ డాక్టర్ పీఎన్ఎస్ చంద్రబోస్ అందించిన సేవలు మరువలేనివని జీహోవా షాలోమ్ చర్చి పాస్టర్ పి.జీవన్ కొనియాడారు. చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని గాస్పల్ మిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీతమ్మ కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలను ప్రారంభించి పేదల విద్యకు పెద్దపీట వేశారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్లు నిహారిక, సుధాకర్, పవన్, శివ రంజిత్, శాలిని, చర్చి సభ్యులు లీలా చంద్రబోస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేయాలి

డీఈఓ పి.శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ విధిగా మధ్యాహ్న భోజనం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. శుక్రవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులందరూ తల్లిదండ్రులతో మాట్లాడి, విద్యార్థులు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని ఆరగించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం షేక్ ఎండీ ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవార పూజలు



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో పూల అలంకరణ



వ్రతం చేస్తున్న మహిళలు



ఆర్ అగ్రహారంలో శ్రీకన్యకాపరమేశ్వరి దేవికి పూల అలంకరణ

స్థానిక సిద్ధార్థనగర్‌లోని కనకమహాలక్ష్మీ మందిరంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం కనకమహాలక్ష్మీ అమ్మవారిని లక్ష్మీదేవిగా విశేషంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో వేదమంత్రాల నడుమ సువాసినులతో కుంకుమ పూజలు, పారాయణాలు విశేష పూజలు నిర్వహించారు. మహా హారతి, మంత్ర పుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

-నగరంపాలెం/ సాక్షి ఫొటోగ్రాఫర్ గుంటూరు

ఆదర్శప్రాయుడు ఆంధ్ర కేసరి టంగుటూరి

ఏఎన్‌యూ: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శప్రాయుడని వీసీ ఆచార్య కె.గంగాధర రావు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగిన ప్రకాశం పంతులు విలువలను కొనసాగింపులో రాజీ లేకుండా ఉండే వారన్నారు. ఆయనలాంటి గొప్ప మనిషిని ఆదర్శంగా తీసుకుంటే నేటి యువత అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధిస్తారని పేర్కొన్నారు. రెక్టార్ కె.రత్నషీలామణి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు పాటించిన విలువలను ప్రతి ఒక్కరం ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి చేరిన అతి కొద్ది మందిలో టంగుటూరి ప్రకాశం పంతులు ఒకరన్నారు. తెలుగు ప్రాచ్యభాష విభాగాధిపతి ప్రొఫెసర్ ఈ.మాధవి, అధ్యాపకులు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు టంగుటూరి ప్రకాశం జీవిత విశేషాలను, ఆయన పొందిన సత్కారాలను, రాష్ట్రానికి ఆయన చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, కోఆర్డినేటర్లు పద్మావతి, డాక్టర్ పి.సుధాకర్, రామచంద్రన్, డాక్టర్ బ్రహ్మాజీ రావు, డాక్టర్ దివ్య తేజోమూర్తి, డాక్టర్ ఎల్వి భూషణం, ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో టంగుటూరి చిత్ర పటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ గంగాధర రావు

డీఎంహెచ్ఓ కార్యాలయంలో...

గుంటూరు మెడికల్: నిరుపేద కుటుంబంలో జన్మించిన టంగుటూరి ప్రకాశం పంతులును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, లక్ష్మీకుమారి, ఎ.జయప్రసాద్, కె.పి.చంద్రశేఖర్, కృష్ణకుమారి, ఆనందరావు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ కార్యాలయంలో.. నివాళులర్పిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు జిల్లా కారాగారంలో..

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. కారాగారం పర్యవేక్షణాధికారి కె.రఘు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత విశేషాలు, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధైర్యసాహసాలను వివరించారు. కార్యక్రమంలో జైలర్లు బి.తేజేశ్వరరావు, సిహెచ్.కిరణ్, డిప్యూటీ జైలర్లు ఎ.కల్యాణ్‌బాబు, కె.అశోక్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో..

గుంటూరు ఎడ్యుకేషన్: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు వాసవి క్లబ్ అధ్యక్షుడు నగేష్‌కుమార్, గుడిమెట్ల దయారత్నం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కరించేందుకు కృషి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. జూడాలు చేపట్టిన సమ్మెను విరమించారు. విధుల్లో చేరుతున్న సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో జూడాల ఆధ్వర్యంలో శుక్రవారం పీజీ వైద్య విద్యార్థులు రక్త దానం చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైద్యులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జూడా నేతలు దీక్షిత్, రవి, లిఖిత పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌లు బాధ్యతగా వ్యవహరించాలి



పట్నంబజారు: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ సూచించారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్‌లు, యజమానుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సీఐ అశోక్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్‌లు ఇష్టానుసారంగా రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వారి ఆటోలు నిలపటం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించకూడదని సూచించారు. ప్రతి ఒక్క డ్రైవర్ తప్పనిసరిగా ఆటోకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని తెలిపారు. ఆటోస్టాండ్‌లు నిర్వహించే వారు తమ స్టాండ్‌ల వద్ద ఆటో క్రమబద్ధీకరణ పద్ధతిని పాటించాలని సూచించారు. ఆటోల యజమానులు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా ఉన్న వారికి ఆటోలు ఇస్తే.. కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. డ్రైవర్ మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేసి కోర్టుకు హాజరుపరుస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

నగరంపాలెం: పసిపిల్లలు దగ్గర్నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పి.సి.డి.ఎస్. అధ్యక్షురాలు పి.గౌరిశిరీష అన్నారు. పాతబస్టాండ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలుర)లో శుక్రవారం సఖి వన్ స్టాప్ సెంటర్, ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ సంయుక్తంగా 1098, 112, బాలికల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దిఖ్ అధ్యక్షత వహించారు. సఖి అడ్మినిస్ట్రేషన్ అడ్మిన్ బి.శాంతభూషన్‌గోపీ, పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలు వసుంధర, శాంతి పాల్గొన్నారు.

అమ్మవారికి సారెతో శోభాయాత్ర


నగరంపాలెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీకంచికామకోటి పీఠపాలిత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికపై సువాసినులతో అమ్మవారికి సారె శోభాయాత్ర అట్టహాసంగా ప్రారంభమైంది. పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, బి.సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన పూజారి మాధవస్వామి బృంద నిర్వహణలో అమ్మవారికి సారె శోభాయాత్ర ఆలయం నుంచి ధార్మిక ప్రాంగణం, పురవీధులలో కొనసాగింది. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గల్లా రామచంద్రరావు దంపతులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు పుట్ట ప్రభాకరరావు, వూటుకూరి నాగేశ్వరరావు, సూర్య దేవర వెంకటేశ్వర్లు, హనుమంతరావు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి కుంకుమార్చనలు, లలిత సహస్ర నామ పారాయణ విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



అమ్మవారికి సారెతో ఎమ్మెల్యే మాధవి, భక్తులు

ఆర్థిక, మానవ వనరుల నిర్వహణలో మేనేజర్ల పాత్ర కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక, మానవ వనరుల నిర్వహణలో మేనేజర్ల పాత్ర ఎంతో కీలకమని హైదరాబాద్‌లోని అమేధ హాస్పిటల్స్ చీఫ్ బిజినెస్ అధికారి ఆర్వీఎస్ఎస్ రవికుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ సంస్థ నిర్వహణలో వ్యూహాత్మక ప్రణాళిక, నిర్ణయం తీసుకునే విధానం, వనరుల కేటాయింపు, సమ్మతి ప్రధాన అంశాలుగా వివరించారు. ఎస్ఏబీహెచ్ నిబంధనల ప్రకారం ఆస్పత్రుల నిర్వహణ ఎంతో సంక్లిష్టమైనదని, వివిధ విభాగాలు, సిబ్బంది, రోగులు, వనరులను సమర్థంగా నిర్వహించడంలో అనుభవం ఎంతో అవసరమని, మేనేజర్లు సంబంధిత కార్యకలాపాలను సులభతరం చేస్తారని అన్నారు. ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర డీన్ ఆచార్య ఆర్.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఎంబీఏ అనేది ప్రత్యేకత కలిగిన ప్రోగ్రామ్ అని, విద్యార్థులను వృత్తి నిపుణులుగా తీర్చిదిద్దడంలో దోహదపడుతుందని తెలిపారు. 2024లో ఎంబీఏ కోర్సు విద్యార్థుల వ్యక్తిగత గుర్తింపు, వ్యవస్థాగత నైపుణ్యాలు, అంతర్జాల అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, పెంపొందించుకోవడంలో సహాయపడుతుందని వివరించారు. పయనీర్ ఆటోమోటివ్స్ అధినేత చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల జీవన విధానాన్ని పరిశీలిస్తే పరిశ్రమలు, వ్యాపార సమస్యలు అర్థమవుతాయని అన్నారు. ప్రతి అంశాన్ని లాభ, నష్టాలతో బేరీజు వేసుకోరాదని, మార్పుకు ఎల్లవేళలా సిద్ధపడాలని అన్నారు. కార్యక్రమంలో హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు మాజేటి సోమశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, అనిత, మణికంఠ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గుంటూరు రూరల్: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ట్రైనీ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ కోరారు. శుక్రవారం రూరల్ మండలం లాలుపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై జరిగిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారి వజ్రశ్రీ,, ఎంపీడీవో ఆది నారాయణ, గుంటూరు వెస్ట్ తహసీల్దారు ఫణీంద్ర, గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఒ.శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

ఆకతాయిల కదలికలపై నిఘా

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: బదిలీపై జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల(పీఎస్)కు వెళ్తున్న ప్రతి ఒక్కరూ నిబ్బతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. పీఎస్‌లల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల(హెచ్‌సీ)ను బదిలీలు చేపట్టారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో వారితో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పీఎస్‌ల పరిధిలోని ఆకతాయిల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సమాచారం ఉన్నట్‌లెత్తై, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. పీఎస్‌లకు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలని అన్నారు. బాధితుల అర్జీలను కూలంకుషంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో న్యాయం జరిగేలా చూడాలన్నారు. పీఎస్‌ల్లోని ప్రతి ఒక్కరూ సంతోషంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(పరిపాలన) జీవీ రమణమూర్తి, ఎస్బీ సీఐ ఆనంద్, కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సీసీ ఆదిశేషు, ఏఆర్ పరిపాలన ఆర్ఐ బ్రహ్మానందం పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నెహ్రూ నగర్: గుంటూరు ఏసీ కళాశాల ఎదురు ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి తగిన చొరవ చూపాలని దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కలసి వినతి పత్రం అందజేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా ఆలోచన చేయాలని కోరారు. కోడిగుడ్డు సత్రం హాస్టల్ పనులు పూర్తి చేసి గురుకుల పాఠశాలగా మార్చి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు నగరంలోని దళిత క్రైస్తవుల శ్మశాన వాటికను సమస్యను పరిష్కరించి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని విన్నవించారు. స్వర్ణ భారతి నగర్ వద్ద క్రిస్టియన్ భవన్ పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, బహుజన డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షులు చాట్ల డేన్నిస్ రాయ్, రజక సంఘం జిల్లా మహిళా నాయకులు వేంపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రతి ఇంటికి ఆస్తి పన్ను విధిగా ఉండాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

నెహ్రూ నగర్: నగరంలో ప్రతి ఇంటికి ఆస్తి పన్ను విధిగా ఉండాలని, భవన నిర్మాణం ప్రకారం ఆస్తి పన్ను ఉండాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి తమ చాంబర్‌లో రెవెన్యూ విభాగ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి రెవెన్యూ డిమాండ్, ఆస్తి విధింపు, ఆస్తి పన్ను పెంపుదలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా, వార్డు సచివాలయాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే సీడీఎంఏ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటులో భాగంగా ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందని కుళాయి లేని వారు సచివాలయాల్లో కుళాయిల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సోమవారం నుంచి అక్టోబర్ 15 దాకా అండర్ అసెస్మెంట్ అన్ అసెస్మెంట్‌పై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి సచివాలయ పరిపాలన కార్యదర్శులు ఉదయం 8 గంటల నుంచి ఫీల్డ్ లోకి వెళ్లాలని సూచించారు. దీనికి పూర్తి బాధ్యత అడ్మిన్ సెక్రటరీలు, ఆర్ఐలు, ఆర్ఓ వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నగరంలో ఖాళీ స్థలాల యజమానుల వివరాల కోసం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ లేఖ పంపాలన్నారు. ప్రతి రోజు డెప్యూటీ కమిషనర్ల వారీగా పురోగతిపై రోజు వారి నివేదికలను అందించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువు అనంతరం, తమ రోజువారీ పర్యటనలో అసెస్మెంట్‌ల పన్ను సరిగా ఉంది లేనిది ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, వ్యత్యాసం గుర్తించినట్లయితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు సి.హెచ్ శ్రీనివాసరావు, డి. వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటరామయ్య, ఆర్ఓ ఎండీ రెహమాన్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మూడు సీటీ స్కాన్లు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో మూడు సీటీ స్కాన్ మిషన్‌లు ఉండటం శుభ పరిణామమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. పొదిల ప్రసాద్ ప్రాంగణంలో సీటీ స్కాన్ మిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.42 లక్షలతో సీటీ స్కాన్ మిషన్‌కు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. మూడేళ్ళ నుంచి సీటీ స్కాన్‌మిషన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. రూ.4 కోట్లతో నూతన సీటీ స్కాన్‌ను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకుని వచ్చిందని వెల్లడించారు. మరమ్మతులకు గురైన సీటీ స్కాన్ మిషన్‌కు నిధులు కేటాయించి వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరామన్నారు. అందులో భాగంగా ఈ పరికరాన్ని రోగులకు అందుబాటులో ఉంచామన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉన్న సీటీ స్కాన్ ద్వారా పలువురు రోగులకు పరీక్షలు చేయించామని తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో మూడు సీటీ స్కాన్ మిషన్‌లు ఉండటం వల్ల రోగులకు చాలా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ జానీ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంట్లో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పరమాయకుంటలో నివాసం ఉండే బీబీజాన్ నాలుగు రోజుల క్రితం విజయవాడలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. తిరిగి శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించింది. లోపలకు వెళ్లి చూడగా, సుమారు ఎనిమిది సవర్ల బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.